ఉత్సాహంగా ప్రాజెక్టు ఎక్స్‌పో



విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ జహంగీర్

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రాజెక్టు ఎక్స్‌పోలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రతిబింబించేలా ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జహంగీర్ హాజరయ్యారు.

వినోభానగర్‌లో వరద బాధితులను ఆదుకోవాలి



వినోభానగర్‌లోని ఓ ఇంట్లోకి చేరిన వరద నీరు

లాలాపేట: ఇటీవల కురిసిన వర్షాలకు తార్నాక మున్సిఫల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని ఇండ్లకు వరద నీరు వచ్చి చేరింది. ప్రధానంగా వినోభానగర్‌లోని పోచమ్మ గల్లీలోని పలు ఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. లాలాపేట ఇందిరానగర్‌లోని కొన్ని ఇండ్లలోకి వరద ప్రవాహంతో ఇంట్లో బురద పేరుకుపోయింది. వినోభానగర్ సంక్షేమ సంఘం నాయకులు బొట్ల నరేష్, జీఎం రమేష్‌లు మారెడుపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఇంతరకు స్పందించలేదన్నారు.

విద్యుత్ సమస్యలపై ఉన్నతాధికారుల బస్తీ బాట



బస్తీల్లో పర్యటిస్తున్న విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

బౌద్ధనగర్: విద్యుత్ సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు బుధవారం విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు బస్తీ బాట పట్టారు. చీఫ్ ఇంజనీర్ మెట్రోజోన్ సాయిబాబా, ఎస్ఈ గోపయ్య, డీఈఈ బ్రహ్మానందం, డీఈ టెక్నికల్ వెంకటేశ్వరచారి, డీఈఈ కన్‌స్ట్రక్షన్ జయరాములు తో పాటు వివిధ సబ్‌స్టేషన్లకు చెందిన ఏఈలతో కలిసి పార్శీగుట్టలో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులతో మాట్లాడి విద్యుత్ సమస్యల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫనా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి



మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందచేస్తున్న కొత్తపల్లి తిరుపతి

ఉస్మానియా యూనివర్సిటీ: వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలతో పాటు వర్సిటీలలో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను బుధవారం కోరినట్లు ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి తెలిపారు ప్రభుత్వ వర్సిటీలలో విద్యార్థులకు సరిపడా హాస్టల్ భవనాలు, మౌలిక వసతులను కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజేందర్, రమేష్, శివాజీ పాల్గొన్నారు.

సీపీగేట్‌కు బీసీ విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన

ఉస్మానియా యూనివర్సిటీ: గతంలో ఎన్నడూలేని విధంగా సీపీగేట్-2025కు అధిక సంఖ్యలో బీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పలు పీజీ కోర్సులలో ప్రవేశాలకు ఆగస్టు 4 నుంచి ప్రారంభంకానున్న ఎంట్రన్స్ పరీక్షకు రూ.500 అపరాధ రుసుముతో దరఖాస్తుల స్వీకరణ నేటితో (24న) ముగియనున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి బుధవారం పేర్కొన్నారు. సీపీగేట్-2025కు ఇంత వరకు 62 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అందులో బీసీ విద్యార్థులు 33 వేలు, ఎస్సీలు 15 వేలు, ఎస్టీ విద్యార్థులు 8,500, ఓసీ విద్యార్థులు ఐదు వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా రూ.2000 అపరాధ రుసముతో ఈ నెల 28 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్ సైట్ చూడవచ్చు.

మురుగు ముంచెత్తుతున్నా పట్టదా?

- గొల్లకొమురయ్య కాలనీ రోడ్డులో నెలల తరబడి పొంగిపొర్లుతున్న డ్రైనేజీ
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- అవస్థలు పడుతున్న జనం



గొల్లకొమురయ్య కాలనీ రోడ్డులో మురుగునీటి ప్రవాహం

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీ రోడ్డులో డ్రైనేజీ మ్యానుహోల్ నుంచి మురికినీరు ఏకధాటిగా ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల నిర్లక్ష్యం....బాధ్యతారాహిత్యం స్థానికులకు సంకటంగా మారింది. నిత్యం వందలాది మంది ప్రజలు...వాహనచోదకులకు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. తీవ్ర దుర్గంధం ...దుర్వాసనతో స్థానికులు ఉక్కిబిక్కిరి వుతున్నారు. మురికినీటిలో నుంచి పాదచారులు రాకపోకలు సాగించలేక పడుతున్న పాట్లు ఇన్నీ కావు. నెలల తరబడి నుంచి ప్రజలు డ్రైనేజీ మురికి నీటి ప్రవాహంతో అష్టాకష్టాలు పడుతున్నారు.

నూతన రోడ్డు వేసినా.....

ఈ ప్రాంతంలో లక్షలాది రూపాయల వ్యయంతో వీడీసీసీ రోడ్డు వేసినా సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. బోయిగూడ ఉప్పలమ్మ దేవాలయం నుంచి గొల్లకొమురయ్య కాలనీ మీదుగా బోలక్‌పూర్ మేకలమడి వరకు నూతన సీసీ రోడ్డును నిర్మించారు. రోడ్డు వేసే ముందు ఇటు జీహెచ్ఎంసీ, అటు జలమండలి అధికారులు సమన్వయంతో పని చేస్తే ఈ సమస్య ఉండేది కాదని స్థానికులు అంటున్నారు. ఐడీహెచ్ కాలనీ, జయనగర్ కాలనీల నుంచి మురికినీరు గొల్లకొమురయ్య కాలనీ రోడ్డు గుండా ప్రవహిస్తున్నది. అయితే కమ్యూనిటీహాల్ ముందు రోడ్డుపై మ్యానుహోల్స్ నుంచి మురికినీరు ఏకధాటిగా పొంగిపొర్లుతోంది. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు సరైన ప్రణాళికలు ...విధానాలు రూపొందించకపోవడంతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. మురికినీటి ప్రవాహంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో స్థానికులు జ్వరాలతో మంచం పడుతున్నారని స్థానిక నాయకులు కె. రాజు సాక్షితో వాపోయారు. ఇప్పటికైనా జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు మురికినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ బిల్లు కోసం ఓయూలో సంతకాల సేకరణ



సంతకం చేస్తున్న డా.జంపాల రాజేష్

ఉస్మానియా యూనివర్సిటీ: పార్లమెంట్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఆమోదించి 9వ షెడ్యూల్ చేర్చాలని ఓయూలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముబోయిన సైదులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ యువ నేత డా.జంపాల రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై సంతకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీసీ బిల్లుతో పాటు మహిళా రిజర్వేషన్లలో బీసీ కోటాను, మండల్ సిఫారస్సులను, 50 శాతం నిధులతో దేశ వ్యాప్తంగా బీసీ సబ్‌ప్లాన్, చట్టసభలు, విద్య, ఉద్యోగాల బీసీ రిజర్వేషన్లను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూషన్, శేఖర్, విక్రమ్, లింగయ్య, అభి, శంకర్, మధు, గణేష్, సంతోష్, ప్రవీణ్, సురేష్, శ్రీధర్, నవీన్, కార్తీక్, చందు, సంతోష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానలో జన్ ఆరోగ్య సమితి సమావేశం



అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్ బస్తీ దవాఖానాలో జన్ ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. మెడికల్ అధికారి డాక్టర్ స్పర్శ అనిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దవాఖానలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై చర్చించారు. వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా ఆసుపత్రికి వస్తే చేయాల్సిన వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. సమావేశంలో బాపూనగర్ బంజారవెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు హరిసింగ్‌జాదవ్,ఆశా వర్కర్లు దీపిక, దీక్ష తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ, జలమండలి జీఎం వినోద్ తదితరులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో స్థానిక కార్పొరేటర్ సామల హేమ జలమండలి అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం స్థానికులతో మాట్లాడారు. దూరం నుంచి నల్లా కనెక్షన్ ఇవ్వడంతో మంచినీరు లోప్రెషర్‌తో వస్తుందని, దగ్గర నుంచి కనెక్షన్ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరగా జలమండలి జనరల్ మేనేజర్ వినోద్ క్షేత్ర పరిశీలన చేపట్టారు. ఆయా కుటుంబాల నివాసప్రాంతంలోని భూమిలో పెద్ద బండరాయి ఉందని, దగ్గర నుంచి నల్లా కనెక్షన్ ఇచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు షాక్ కొట్టకుండా ప్లాస్టిక్ షీట్లు వేయాలని కోరగా, వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం వినోద్, సెక్షన్ మేనేజన్ నవ్య, శ్రీకాంత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి



పవర్‌బోర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: పార్కుల అభివృద్ధిలో స్థానిక ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. బుధవారం సనత్‌నగర్‌లోని మూడు పార్కుల్లో అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన పవర్‌బోర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోనే అత్యధిక పార్కులు ఉన్న డివిజన్‌గా సనత్‌నగర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా కాలనీల్లోని ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపే వెసులుబాటు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్కుల్లో మొక్కల పెంపకానికి అవసరమైన నీటి కోసమే నూతనంగా బోర్లను ఏర్పాటుచేశామని తెలిపారు. సందర్భంగా పలువురు స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి, డీసీ జయంత్, ఈఈ వెంకటేశ్వరరావు, వాటర్‌వర్క్స్ జీఎం ప్రభాకర్‌రావు, హార్టికల్చర్ అధికారి జ్యోత్స్న పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పైకప్పునకు మరమ్మతు చేయండి

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని ఆర్‌యూబీ పైకప్పునకు మరమ్మతులు చేయాలని కోరుతూ తుకారాంగేట్‌కు చెందిన సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం హైద్రాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్, జోనల్ కమీషనర్ రవికిరణ్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ లాలాగూడ రైల్వే స్టేషన్ వద్ద గతంలో నిర్మించిన ఆర్‌యూబీ బ్రిడ్జ్ పైనుంచి నీళ్లు లీక్ అవుతున్నాయన్నారు. ఈ బ్రిడ్జ్ పై నుంచి ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు నిత్యం వెళ్తుంటాయని, బ్రిడ్జ్ కింది నుంచి వేలాది వాహనాల రాకపోకలు సాగుతాయని చెప్పారు. అందువల్ల ఆర్‌యూబీ పైకప్పుకు మరమ్మతు చేసి వాటర్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన గంగారాం, శేష చారి, రాజారామ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి



చిక్కడపల్లి: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. టీఆర్టీ క్వార్టర్స్‌లో నిర్మిస్తున్న తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను వాటర్‌వాక్స్ మేనేజర్ కృష్ణమోహన్‌తో కలసి బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. డివిజన్‌లో ప్రెషర్, కలుషిత నీటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వాటర్‌వర్క్స్ అధికారులే దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, రఘు యాదవ్, కాంగ్రెస్ నాయకుల శీలం సత్యనారాయణ, వినోద్ బోంస్లే, వాల్టస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార వాణిజ్య భవనాన్ని సీజ్‌చేసిన అధికారులు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ రోడ్డునెంబర్-13లోని ప్లాట్‌నెంబర్-51లో నివాస భవనాన్ని అనధికారికంగా వాణిజ్య భవనంగా మార్చడంతో జూబ్లీహిల్స్ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ భవనంలో వాణిజ్య ఆమోదం పొందకుండా జీ ప్లస్ 5 అంతస్తు నిర్మించి గీతాంజలి మోడల్ స్కూల్‌ను నడుపుతున్నట్లు వెల్లడించారు. అలాగే షేక్‌పేట వెటర్నరీ కాలనీలో అబ్దుల్ నవాజ్ అనే వ్యక్తి స్టిల్ట్ ప్లస్ 4 అనుమతులు తీసుకుని అక్రమంగా ఐదో అంతస్తు నిర్మాణం, అనధికార సెల్లార్ నిర్మాణం, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘన చేయడంతో సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-1లో ప్లాట్‌నెంబర్-96 యజమాని స్టిల్ట్ ప్లస 4 అంతస్తుల అనధికార నిర్మాణం చేపట్టగా సీజ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని దుర్గానగర్‌కాలనీలో ఆర్కే అగర్వాల్ అనే వ్యక్తి అదనపు అంతస్తు అక్రమంగా నిర్మించగా సీజ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి మంజూరు చేయబడిన భవన ప్రణాళికల ఉల్లంఘనల ఆధారంగా వీటిని సీజ్ చేసినట్లు డీసీ సమ్మయ్య తెలిపారు.

ఎన్టీఆర్ మార్గ్‌లో చెట్టును ఢీ కొట్టిన కారు

ఖైరతాబాద్: ఎన్టీఆర్ మార్గ్‌లో కారు అదుపు తప్పి భారీ చెట్టును ఢీకొంది. బుధవారం ఉదయంసచివాలయం వైపు నుంచి ఐమాక్స్ రోటరీ చౌరస్తా వైపు వస్తున్న కారు ఎన్టీఆర్ మార్గ్‌లో అదుపు తప్పి డివైడర్ పక్కనే ఉన్న భారీ చెట్టును ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ఏయిర్ బెలూన్‌లు ఓపెన్ కావడంతో కారు నడుపుతున్న వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. కారు మలుపు వద్ద వెనుక టైర్‌లో గాలి తక్కువగా ఉండం వల్ల అదుపు తప్పి చెట్టును ఢీకొని ఉండవచ్చని భావిస్తున్నారు. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని తొలగించారు.



వివాహిత ఆత్మహత్య

అమీర్‌పేట: ఎస్ఆర్ నగర్‌పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రాజస్థాన్‌కు చెందిన దేవి (23) జయంత్‌లాల్ దంపతులు కొంత కాలం క్రితం నగరానికి వచ్చారు. జయంత్‌లాల్ అమీర్‌పేట అన్నపూర్ణ బ్లాక్‌లో కంప్యూటర్స్ పరికరాలు (స్పేర్ పార్ట్స్) విక్రయించే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వీరు అన్నపూర్ణ బ్లాక్ వెనకాల గల అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. బుధవారం ఎప్పటిలాగే షాప్‌కు వెళ్లి మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఫ్లాట్‌కు వచ్చాడు. అయితే ఇంట్లో భార్య దేవి చున్నీతో ఫ్యాన్‌కు ఉరికి వేలాడుతూ కనిపించింది. అప్పటికే మృతి చెందినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: ఉస్మానియా యూనివర్సిటీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 24న ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సీబీడీ ప్యారడైజ్ సబ్ డివిజన్ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మెట్టుగూడ ఫీడర్ పరిధిలోని మెట్టుగూడ పార్కు, రైల్వే క్లబ్, అశోక లైబ్రరీ, బొందలగడ్డ, కృపా అపార్ట్‌మెంట్, స్కైలాబ్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి 5 వరకు కేశవనగర్ ఫీడర్ పరిధిలోని కేశవనగర్, స్కైలాబ్ హోటల్, సువర్ణ అపార్ట్‌మెంట్, రైల్వే వాటర్ వర్క్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.


రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ పరిధిలోని బోయిన్‌పల్లి, ఏడబ్ల్యూహెచ్‌వో కాలనీ, జూపీటర్ కాలనీ, లాల్‌బజార్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నటల్ ఏడీఈ మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు డైమండ్ పాయింట్, జవహార రైల్వే కాలనీ, కిరణ్ ఎన్‌క్లేవ్, వాహినినగర్, ఎల్ఐసీ కాలనీ, ఏడబ్ల్యూహెచ్‌వో ఏ బ్లాక్ నుంచి బ్లాక్ ఎం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 2. 30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జూపీటర్ కాలనీ, డీఏడీ క్వార్టర్స్, పీ అండ్ టీ కాలనీ, తిరుమలగిరి, హనుమాన్ టెంపుల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం




అడ్డగుట్ట: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన సూచించారు. బుధవారం అడ్డగుట్టలోని ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో డిబిఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, కిడ్నీ, లివర్ సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు చేసిన మాజీ గవర్నర్



బౌద్ధనగర్: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. బుధవారం మాజీ కార్పొరేటర్ స్వరూప రవిప్రసాద్ గౌడ్ నివాసంలో జరిగిన ఈ పూజల్లో ఆయన పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ల పంపిణీ



రసూల్‌పురా: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం బాలింత స్త్రీలకు కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు.రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మన్నే క్రిషాంక్ ఆధ్వర్యంలో రసూల్‌పురా గన్‌బజార్ కమ్యూనిటి హాల్‌లో 70 మందికి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యూసిన్, అబ్బు, ఫహీం, రఘు, మోని, సాయికిరణ్, యాకూబ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కుటుంబాలకు సొసైటీ అండగా ఉంటుంది



నర్సింగరావు కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్నా చిలుకు స్వామి

సికింద్రాబాద్: రైల్వే దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి చెప్పారు. రైల్వే ఉద్యోగి, సొసైటీ సభ్యుడు నర్సింగారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం నర్సింగరాలవు భార్య కావ్యకు సొసైటీ అధ్యక్షులు చిలుకు స్వామి రూ. 10 లక్షల వాటా ధనం చెక్కును అందించారు. గతంలో నరింగరాలవు సొసైటీ నుండి తీసుకున్న రూ. 11 లక్షల రుణాన్ని కూడా మాఫీ చేసినట్టు చెప్పారు. సొసైటీ డైరెక్టర్లు కృష్ణ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు



ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గీతాదయాకర్ రావు

లాలాపేట: సికింద్రాబాద్ నియోజక వర్గం బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు ముత్యాల గీతాదయాకర్ బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ నెల 30న తన రెండవ కుమార్తె మౌనికారావు వివాహానికి సంబంధించిన పెళ్లి పత్రిను పద్మారావు గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ముత్యాల దయాకర్‌రావు, బిఆర్ఎస్ నాయకులు పొన్నాల రాజు, మోహిన్ తదితరులున్నారు.

నవ నిర్మాణ్‌నగర్‌లో విద్యుత్ అధికారుల బస్తీబాట



నవ నిర్మాణ్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్ అధికారులు..

బంజారాహిల్స్: బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యుత్ అధికారులు, సిబ్బంది జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-71లోని నవనిర్మాణ్‌నగర్ కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. నవ నిర్మాణ్‌నగర్‌కాలనీ గౌరవ చైర్మన్ సీహెచ్.వెంకటప్రసాద్, ప్రెసిడెంట్ బి.హర్షవర్ధన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎస్.రామచందర్‌రాజు, సెక్రటరీ ఉమామహేశ్వరరావు తదితరులు టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ ఏడీఈ జి.రమేష్‌కు సమస్యలను వివరించారు. ముఖ్యంగా కరెంటు వైర్లకు చెట్ల కొమ్మలు తాకుతున్నాయని, వెంటనే ట్రిమ్మింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫిలింనగర్ సబ్‌స్టేషన్ ఏఈ పవిత్ర పాల్గొన్నారు.

మహిళ పర్సు చోరీ..ఏటీఎం కార్డుతో రూ.40 వేలు డ్రా

బంజారాహిల్స్: దైవదర్శనం కోసం వచ్చిన భక్తురాలి పర్సు కొట్టేసిన దొంగ..అందులోని ఏటీఎం కార్డు ద్వారా బ్యాంకులో రూ.40 వేలు డ్రా చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దుండిగల్‌కు చెందిన జి.అనిత అనే మహిళ కుటుంబ సభ్యులతో కలిసి జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయానికి అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. దర్శనానికి వెళుతున్న క్రమంలో ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి పర్సును గుర్తుతెలియని వ్యక్తులు కొట్టేశారు. దర్శనం ముగించుకుని ఇంటికి వెళ్ళిన తర్వాత పర్సు మిస్ అయిన విషయాన్ని బాధితురాలు గుర్తించింది. కాసేపట్లోనే ఆమె ఫోన్‌కు బ్యాంకు నుంచి డబ్బులు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన బాధిత మహిళ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పర్సులోని ఏటీఎం కార్డు మీద పిన్ నెంబర్ రాసుకుని ఉండటంతో నిందితుడు సులభంగా డబ్బులు డ్రా చేసినట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న జూబ్లీ హిల్స్ క్రైమ్ పోలీసులు ఆలయంలోని సీసీ ఫుటేజ్, ఏటీఎంలోని ఫుటేజ్ పరిశీలిస్తున్నారు.

త్వరలో రోడ్డుకు మరమ్మతులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14 ప్రధాన రహదారిలో రత్నదీప్ సూపర్ మార్కెట్ నుంచి మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ ఇంటి వరకు రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ అపార్ట్‌మెంట్ ముందు ఇటీవలనే మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తిచేశారు. ఇందుకోసం రోడ్డంతా తవ్వారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు మొత్తం గుంతలమయమై బురదతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఈ రోడ్డు రెస్టోరేషన్ పనులు చేసేందుకు జీహెచ్ఎంసీ రూ.24 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులు వెంటనే చేపట్టేవిధంగా బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్, జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఈ అభినయ్, ఏఈ సతీష్‌లతో పాటు ఇతర సిబ్బంది పర్యటించారు. ఈ రోడ్డు పనులు మొదలుపెట్టిన తర్వాత ఎప్పటిలోగా పూర్తవుతాయి.. ట్రాఫిక్‌పరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ట్రాఫిక్ పోలీసుల అనుమతి రాగానే పనులు మొదలుపెడతామని ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379